ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 31.0
కనిష్ఠం 23.2
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి



శనివారం 20 సెప్టెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.20 (305.6242)	2,78,066	2,81,377
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.95 (4.18)	4,704.02	4,255.35
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.209 (41.5360)	2,44,320	2,30,351

చికెన్ ధరలు	లైవ్ : రూ.152	డ్రెస్ : రూ.230	స్కిన్‌లెస్ : రూ.260



సాదాబైనామాలకు

- నోటీసులు జారీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు
- హైకోర్టు ఆదేశాలతో భూసమస్యల పరిష్కారానికి మార్గం
- జిల్లాలో మొత్తం 15,994 దరఖాస్తులు
- సాగులో ఉంటేనే క్రమబద్ధీకరణ
- ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లోనే

భూ సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తెల్లకాగితాలపై రాసుకున్న భూ కొనుగోళ్ల ఒప్పందాల (సాదాబైనామా) క్రమబద్ధీకరణకు సన్నాహాలు చేస్తోంది. సాదాబైనామా దరఖాస్తుదారులకు నోటీసులు జారీచేసే ప్రక్రియను ప్రారంభించింది. జిల్లాలోని 17 మండలాల్లో మొత్తం 15,994 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటికీ త్వరలో మోక్షం కలగనుంది.

– (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

సాదాబైనామాతో భూములు కొనుగోలు చేసి హక్కుల కోసం ఎదురుచూస్తున్న చాలా మంది రైతులకు ప్రభుత్వ నిర్ణయంతో ఊరట లభించనుంది. ధరణి చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం కావడంతో పాటు వెబ్‌పోర్టల్‌లో తిరస్కరణ దరఖాస్తులే అధికంగా ఉండేవి. దీంతో ప్రజలు నానా కష్టాలు పడ్డారు. దీని స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చింది. జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన మండలాలు, ఆ తరువాత అన్ని మండలాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అధిక శాతం దరఖాస్తుల్లో సాదాబైనామాలే ఉన్నాయి. తెల్లకాగితంపై రాసుకున్న లావాదేవీల క్రమబద్ధీకరణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2016, 2020లో రెండు దఫాలుగా దరఖాస్తులు తీసుకుంది. వీటిలో చాలావరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో భూభారతిలో ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. 2014 జూన్ 2వ తేదీ వరకు సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసిన భూములను క్రమబద్ధీకరించనున్నారు. జిల్లాలో 17 మండలాల్లో మొత్తం 15,994 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

రెండు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఉన్న దరఖాస్తుల పరిష్కారం కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూ కబ్జాలో ఉంటేనే క్రమబద్ధీకరించనున్నారు. గ్రామాల్లో భూములను పరిశీలించి, రైతులు సాగుచేసుకుంటున్నారా? వారు భూయజమానులా? అనే సమగ్ర సమాచారాన్ని సేకరించి, పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేస్తున్నారు. రైతుల భూములను పరిశీలించిన అనంతరం వారికి నోటీసులు జారీచేయనున్నారు.

విచారణాధికారులుగా ఆర్డీవోలు

ఆర్వోఆర్-2020 స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్వోఆర్-2025 భూభారతి చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టంలోని సెక్షన్-6 ద్వారా సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించారు. విచారణాధికారిగా ఆర్డీవోకు బాధ్యతలు అప్పగించారు. 2020-ఆర్వోఆర్ చట్టంలో క్రమబద్ధీకరణ సెక్షన్ లేకపోవడంతో అప్పట్లో ఈ ప్రక్రియను న్యాయస్థానం నిలిపివేసింది. సాదాబైనామాల క్రమబద్ధీకరిస్తామని

- మిగతా 8వ పేజీలో...

జిల్లాలో సాదా బైనామా దరఖాస్తులు ఇలా..

మండలం	దరఖాస్తులు
అడ్డగూడూరు	2,440
గుండాల	1,718
వలిగొండ	1,383
భువనగిరి	1,234
రామన్నపేట	1,071
నారాయణపూర్	1,006
రాజపేట	987
మోత్కూరు	983
బొమ్మలరామారం	852
ఆలేరు	776
మోటకొండూరు	672
భూదాన్‌పోచంపల్లి	575
ఆత్మకూరు	352
బీబీనగర్	524
తుర్కపల్లి	551
చౌటుప్పల్	460
యాదగిరిగుట్ట	410
మొత్తం	15,994

ఆన్‌లైన్‌లోనే క్రమబద్ధీకరణ ప్రక్రియ

సాదాబైనామా దరఖాస్తుల ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే కొనసాగనుంది. భూభారతి పోర్టల్‌లో ఉన్న దరఖాస్తుల పరిశీలనతో పాటు తహసీల్దార్, ఆర్డీవోల ఆమోదాన్ని డిజిటల్ సైన్ ద్వారా చేయనున్నారు. 2020 అక్టోబరు 1 నుంచి నవంబరు 10వ తేదీ వరకు ఆన్‌లైన్ ఉన్న దరఖాస్తులనే పరిగణనలోకి తీసుకోనున్నారు. దరఖాస్తుదారులందరికీ అధికారులు నోటీసులు జారీ చేయనున్నారు.

వర్షాలు అధికమే అయినా..

- నిండని చెరువులు, కుంటలు
- యాసంగి సాగు కష్టమేనంటున్న రైతులు


పూర్తిస్థాయిలో నిండని దత్తప్పగూడెం చెరువు

రాష్ట్రంతోపాటు జిల్లాలో కురిసినట్టుగానే మోత్కూరు మండలంలోనూ ఈ ఏడాది అధిక వర్షాలు కురిశాయి. అధిక వర్షాలకు పత్తి, కంది తదితర మెట్ట పంటలు దెబ్బతినగా, మండలంలో చాలా చెరువులు, కుంటలు మాత్రం నేటికీ నిండలేదు. బిక్కేరు వాగు వెంట ఉన్న గ్రామాల్లో మాత్రమే జలకళ కనిపిస్తుండగా, ఇతర గ్రామాల్లో చెరువులు, కుంటలు బోసిపోయి కన్పిస్తున్నాయి. భీమలింగం కాల్వ నుంచి నీరొచ్చే పాలడుగు చెరువు కూడా నేటికీ నిండలేదు. పాలడుగు చెరువు నిండితే ముశిపట్ల, ఆరెగూడెం గ్రామాల్లో నీటి ఊటలు ఉంటాయనేది గతం మాట. ప్రస్తుతం బావులు తవ్వినా నీరు రావడం లేదు. ఈ నేపథ్యంలో యాసంగిలో నీటి ఎద్దడి ఏర్పడవచ్చని, అలా జరిగితే పంటల సాగు కష్టమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– (ఆంధ్రజ్యోతి,మోత్కూరు)

మోత్కూరు మండలంలో జూన్, జూలై మాసాల్లో పెద్దగా వర్షాలు లేవు. దీంతో మొదట్లో వరి సాగు మందగించింది. పత్తి విత్తనాలు కూడా సరిగా మొలకెత్తక పలువురు రైతులు రెండు, మూడు సార్లు విత్తనాలు విత్తారు. మొలకెత్తాక కూడా అనుకూలంగా వర్షాలు లేక పత్తి చేలు ఎదగలేదు. పంగ తేలలేదు. చేను ఎదగకుండానే పూత, కాత వచ్చింది. ఆగస్టు, సెప్టెంబరులో కురుస్తున్న అధిక వర్షాలకు పత్తి చేలు జాలువారాయి. పలు చోట్ల పత్తి చేలకు జాజు రోగం ఆశించింది. పత్తి చేలు ఎర్రబారి చెట్టుకు ఉన్న కాయలు, చెట్టు ఎండుతోంది. మండల సాధారణ వర్షపాతం 533.6మి.మీ. కాగా, ఇప్పటి వరకు 735.2మి.మీ. వర్షపాతం నమోదైంది. ఒక్క సారికూడా పత్తి తీత చేయకముందే జాజు రోగం రావడంతో ఈ సారి పెట్టుబడులైనా చేతికి వస్తాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధిక వర్షాలు కురిసినా..

మోత్కూరు మండలంలో అధిక వర్షాలు కురిసినా పలు గ్రామాల్లో నేటికీ చెరువులు, కుంటలు నిండలేదు. బృందావన్ కాల్వ

- మిగతా 8వ పేజీలో...

ఓటరు జాబితాలో తప్పులు ఉండొద్దు

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి, పాల్గొన్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో తప్పులు ఉండొద్దని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన మాట్లాడుతూ స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నిర్వహణ ఒక ప్రణాళిక ప్రకారం జరిగేలా చూడాలన్నారు. 2002 ఎస్ఐఆర్ డేటాను 2025 డేటాతో పరిశీలించిన తర్వాత రెండు డేటాల్లో ఓటరు జాబితాలో ఒకేమాదిరిగా ఉన్న పేర్లను మినహాయించాలన్నారు. 2002 తర్వాత ఓటరుగా నమోదైన వారి వివరాలను మరోసారి క్షేత్రస్థాయిలో ధ్రువీకరించాలన్నారు. ఎస్ఐఆర్ నిర్వహణపై బూత్ లెవల్ అధికారులకు మాస్టర్ ట్రైనర్ల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచనలతో ఇటీవల మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ నిర్వహణ జరిగిందన్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ ఈఆర్వో, డిప్యూటీ తహసీల్దార్లు, బీఎల్వోలు, సూపర్‌వైజర్లు సమావేశాలు నిర్వహించి, నిర్ణీత లక్ష్యంతో ఎస్ఐఆర్ పూర్తి చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో సీఈవో లోకేష్ కుమార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జీ.వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

‘లోక్ కళ్యాణ్’ మేళాపై అవగాహన కల్పించాలి

అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు


మెప్మా సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, డీఆర్డీవో నాగిరెడ్డి

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా అవసరమైన రుణాలు ఇప్పించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కర్‌రావు అన్నారు. లోక్ కళ్యాణ్ మేళాపై కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 నుంచి 29 ఏళ్లలోపు నిరుద్యోగ మహిళలు, పురుషులను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ అందించాలన్నారు. వీధి వ్యాపారులకోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన లోక్ కళ్యాణ్ మేళాలో అక్టోబరు 2 వరకు రుణాలు అందించి, డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించాలన్నారు. బతుకమ్మ చీరలను త్వరలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టీ.నాగిరెడ్డి, మెప్మా పీడీ రమేష్ బాబు, ఆలేరు, యాదగిరిగుట్ట మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

రిటైర్డ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఐవీ సుబ్బారావు

భువనగిరి రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యతోపాటు నాణ్యమైన భోజనం అందుతుందని రిటైర్డ్ ప్రిన్సిపల్ సెక్రటరీ,నీతి ఆయోగ్ ఎడ్యుకేషనల్ స్కిల్ సభ్యుడు ఐవీ.సుబ్బారావు అన్నారు. శుక్రవారం భువనగిరి మండలంలోని అనంతారంలో జడ్పీ, ప్రైమరీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యాబోధన, డిజిటల్ క్లాస్, సైన్స్ ల్యాబ్ వినియోగం, సైన్స్ ప్రయోగాలు తదితర అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఏపూరి భాస్కర్ రావు, డీఈవో కె.సత్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ కె.నర్సింహారావు, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్, సీడీపీవో శాగంటి శైలజ, ఎంఈవో నాగవర్ధన్‌రెడ్డి, ఎంపీవో దినకర్, ప్రధానోపాధ్యాయుడు రంగరాజన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలోని శ్రీవేంకటేశ్వర జిల్లా ఉన్నత పాఠశాలలో 69 ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి పాఠశాలల కబడ్డీ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభించారన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, గెలుపొందిన క్రీడాకారులకు రాష్ట్రస్థాయిలో రాణించాలన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పోరాటాల పురిటిగడ్డ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని నడిపిన యోధులు, సంస్కృతంలోని భగవద్గీతను వాడుక భాషలోకి అనువదించిన గొప్పవారు నడయాడిన నేల యాదాద్రి జిల్లా అని కొనియాడారు. విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని టోర్నమెంట్ నిర్వహణ దాత పసల జ్యోతి-విజయనంద్ అన్నారు. తన సోదరుడు దివంగత పసల సంపత్‌కుమార్ జ్ఞాపకార్థం పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో భాస్కర్, మండల ప్రత్యేక అధికారి జగన్నాథరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ దశరథరెడ్డి, ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, తహసీల్దార్ దశరథ, గ్రామ ప్రత్యేక అధికారి సందీప్‌రెడ్డి, విజయలక్ష్మి, మాజీ ఎంపీపీలు నూతి రమేష్‌రాజు, చిట్టెడి జనార్థన్‌రెడ్డి, పీఈటీలు స్వామిరాజ్, చండీదాస్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బడా పారిశ్రామికవేత్తలకు కొమ్ముకాస్తున్న కాంగ్రెస్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


ట్రిబుల్‌ఆర్ నిర్వాసితులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ.రామారావు

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ట్రిబుల్‌ఆర్ అలైన్‌మెంట్‌లో చిన్న, సన్నకారు రైతులను మోసం చేస్తూ బడా పారిశ్రామికవేత్తలకు కాంగ్రెస్ కొమ్ముకాస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. చౌటుప్పల్ ప్రాంతంలోని ట్రిబుల్‌ఆర్ భూనిర్వాసితులు శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా భూనిర్వాసితుడు దబ్బటి రాముగౌడ్ మాట్లాడుతూ కొన్ని పరిశ్రమలను రక్షించేందుకు ట్రిబుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చారని, దీంతో సన్న, చిన్న కారు రైతులతోపాటు ఇళ్లు కోల్పోయి ఎంతో మంది రోడ్లమీద పడే అవకాశం ఉందన్నారు. ఓఆర్ఆర్ నుంచి 50 కిలోమీటర్ల దూరం నుంచి వెళ్లాల్సిన రోడ్డును 28 కిలోమీటర్లకు కుదించారన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ ట్రిబుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చడంలో ప్రభుత్వ పెద్దల స్వార్థం కనిపిస్తోందన్నారు. భూనిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. ఈ నెల 21న తెలంగాణ భవన్‌లో భూ నిర్వాసితులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు పల్లె రవికుమార్, దూదిమెట్ల బాలరాజు, సుర్వి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరుతేవాలి


ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

భువనగిరి గంజ్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు పేరు తేవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సి.రమణి అన్నారు. శుక్రవారం భువనగిరి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బాలురు, బాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, ఎన్.ప్రసాద్, కోచ్ లింగ్యా నాయక్, ఫిజికల్ డైరెక్టర్ అంజలి తదితరులు పాల్గొన్నారు.


వలిగొండలో సమాశంలో మాట్లాడుతున్న ఎండీ.జహంగీర్

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎండీ.జహంగీర్

వలిగొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ప్రొద్దటూరు గ్రామంలో సీపీఎం గ్రామశాఖ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎండీ.జహంగీర్ మాట్లాడుతూ తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటి రెండు సంవత్సరాలు కావస్తున్నా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించకపోవడంతో గ్రామాల్లో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, నాయకులు వెంకటేష్, ముత్యాలు, లింగం, మాధవి, కృష్ణ, మణెమ్మ బాలయ్య, నర్సింహ పాల్గొన్నారు.

చిత్రలేఖనంతో సృజనాత్మకత వెలికితీత

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చిత్రలేఖనంతో సృజనాత్మకతను వెలికితీయవచ్చని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలో సాంస్కృతిక పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ‘వికసిత్ భారత్ కే.. రంగ్ కళా కే సంగ్’ అనే అంశంపై జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించారు. ఆయా పాఠశాలలకు చెందిన 140 మంది విద్యార్థులు పాల్గొనగా, విజేతలకు బహుమతి ప్రదానం చేసి ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, కళాత్మక పోటీల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే చిత్రలేఖనం పోటీలపై సమాచారం ఇవ్వకుండా నిర్వహించడం సరికాదని పలువురు ఆరోపించారు.

అంశాలపై చర్చించకుండానే ముగింపు

మోత్కూరు సింగిల్‌విండో డైరెక్టర్ అశోక్‌రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న సింగిల్‌విండో డైరెక్టర్, మాజీ చైర్మన్ అశోక్‌రెడ్డి

మోత్కూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు సింగిల్ విండో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఎజెండా అంశాలపై చర్చించకుండానే చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు ముగించారని ఆ సంఘం డైరెక్టర్, మాజీ చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మోత్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020లో జరిగిన సింగిల్ విండో ఎన్నికల్లో తాను చైర్మన్‌గా ఎన్నిక కాగా రాజకీయ విభేదాలతో 2024 జూన్‌లో అవిశ్వాసం పెట్టి చైర్మన్ పదవి నుంచి తొలగించారన్నారు. తాను ప్రస్తుతం డైరెక్టర్‌గా కొనసాగుతున్నానన్నారు. సమస్యలపై ప్రశ్నిస్తానన్న భయంతోనే చైర్మన్ ఎజెండా అంశాలపై చర్చించకుండా సమావేశం నుంచి వెళ్లిపోయారన్నారు. సింగిల్ విండో డైరెక్టర్లు సామ పద్మారెడ్డి, పురుగుల మల్లయ్య, దేవసరి రాములు, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్, జంగ శ్రీను, మాజీ సర్పంచ్ తరుమలేష్, నాయకులు కె.పరమేష్, గజ్జి మల్లేష్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

● చిన్నేటివాగు నుంచి ఎక్స్‌కవేటర్ సాయంతో ఒడ్డుకు ...



ఎక్స్‌కవేటర్ సాయంతో యువకుడిని కాపాడిన పోలీసులు, వాగులోచిక్కుకున్న మహేష్

భువనగిరి రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని చిన్నేరువాగులో కొట్టుకుపోతున్న యువకుడిని పోలీసులు కాపాడారు. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బీబీనగర్ మండలం మాదారం గ్రామానికి చెందిన అవురావేతి మహేశ్ చిన్నేరువాగు కల్వర్టుపై నుంచి రోడ్డు దాటుతున్నాడు. మూసీ ఉధృతి ఎక్కువగా ఉండడంతో మహేశ్ వరద ప్రవాహంలో కొట్టుకునిపోయి చెట్టుకొమ్మను పట్టుకుని ప్రాణభయంతో కొట్టుమిట్టాడాడు. గమనించిన అక్కడే ఉన్న కానిస్టేబుల్ నాగరాజు వెంటనే పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్, భువనగిరి ట్రాఫిక్ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, కానిస్టేబుల్ స్టాలిన్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్ సాయంతో సాహసోపేతంగా గంటపాటు శ్రమించి అతడిని ఒడ్డుకు చేర్చారు. ఎగువ ప్రాంతం నుంచి మూసీ ఉధృతి ఎక్కువగా ఉన్నందున ప్రజలు లోతట్టు కల్వర్టుల పైనుంచి ప్రయాణించవద్దని హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడిపై కేసు నమోదు

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేసిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడిపై కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్దిరాల మండలం పోలుమళ్ల గ్రామానికి చెందిన కొండ లింగన్న భార్య రమణ పేరున ఇంటిరమ్మ ఇళ్లు మంజూరు కాగా ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడైన అదే గ్రామానికి చెందిన పాల్వాయి సత్తయ్య తనకు రూ.10 వేలు ఇవ్వాలని లేదంటే ఇంటి అనుమతులు నిలిపివేయిస్తానని బెదిరించాడు. దీంతో లబ్ధిదారుడు కొండ లింగన్న రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎండీకి టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా ఫోన్‌చేసి ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు ఈ నెల 16న జిల్లా హౌసింగ్ పీడీ సిద్ధార్థ పోలుమల్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామకార్యదర్శి సమక్షంలో పాల్వాయి సత్తయ్యను, అదేవిధంగా లబ్ధిదారులు కొండ లింగన్న-రమణ దంపతుల విచారించారు. విచారణలో సత్తయ్య రూ.10 వేలు డిమాండ్ చేసినట్లు నిర్ధారణ అయ్యిందని ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. దీంతో సత్తయ్యపై మద్దిరాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయించడంతో పాటు సత్తయ్యను ఇందిరమ్మ ఇళ్ల కమిటీ నుంచి వెంటనే తొలగించినట్లు కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

అందని కాస్మెటిక్, డైట్‌చార్జీలు



(ఫైల్)

(ఆంధ్రజ్యోతి-కోదాడ)

విద్యాసంవత్సరం ప్రారంభమై మూడునెలలు గడుస్తున్నా గురుకులాల్లోని విద్యార్థులకు నేటికీ కాస్మెటిక్ చార్జీలు, దుస్తులు అందలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 79 గురుకులాలు ఉన్నాయి. అందులో బీసీ 29, ఎస్సీ 18, ఎస్టీ 19, మైనార్టీ 13గురుకులాలు ఉండగా 37,500మంది 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యనభ్యసిస్తున్నారు. గురుకులాల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు ఆహారం, వసతి, క్రీడలు, నైపుణ్యాభివృద్ధిలో రాణించాలనేది ప్రభుత్వ లక్ష్యం. అంతేకాక గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, మూడు జతల దుస్తులు, కాస్మెటిక్స్ 12 రకాలు కొనేందుకు చార్జీలు అందజేస్తోంది. సెప్టెంబరు నెల వచ్చినా నేటికి విద్యార్థులకు దుస్తులు, కాస్మెటిక్ చార్జీలు అందలేదు. దీంతో పాత దుస్తులతో తరగతులకు హాజరవుతున్నారు. పాఠ్యపుస్తకాలు సైతం మూడు రోజుల కిందట అందినట్లు సమాచారం. ప్రభుత్వం విద్య సంవత్సరం ప్రారంభంలోపే దుస్తులు, పాఠ్యపుస్తకాలు, కాస్మెటిక్ చార్జీలు అందిస్తే, విద్యార్థుల విద్యకు ఆటంకం లేకుండా ఉంటుందని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి కాస్మెటిక్ చార్జీలు నేరుగా విద్యార్థి ఖాతాలో వేయాలని ప్రభుత్వం భావించినప్పటికీ నేటికి ఆ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు.

తరగతి	కాస్మెటిక్ గతంలో/ ప్రస్తుతం	డైట్‌చార్జి గతంలో/ ప్రస్తుతం
5,6,7వరకు	రూ.55 /175	రూ.950/రూ.1,330
8,9,10వరకు	రూ.75/రూ.275	రూ.1,100 / రూ.1,540
ఇంటర్,డిగ్రీ	———	రూ.1,500/రూ.2,100

- పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు
- నేటికీ అందక విద్యార్థులకు ఇబ్బందులు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 79 గురుకులాలు, 37, 500 మంది విద్యార్థులు

పెరిగినా చేరలే..

గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం నుంచి కాస్మెటిక్ చార్జీలు, డైట్ చార్జీలను ప్రభుత్వం పెంచింది. అంతేకాకుండా ఈ ఏడాది నుంచి ఆయా నిధులను నేరుగా విద్యార్థి బ్యాంకు అకౌంట్‌కు జమచేయాలని నిర్ణయించింది. అయితే కొందరు విద్యార్థుల బ్యాంకు ఖాతా తెరవలేదు. త్వరగా విద్యార్థుల ఖాతాను ఓపెన్ చేసి, చార్జీలను ఖాతాలో జమచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కాస్మెటిక్స్ ఇలా

5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న బాల,బాలికలకు 11 రకాలు, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు 12 రకాల కాస్మెటిక్స్ కొనుగోలుకు ప్రభుత్వం చార్జీలు అందిస్తుంది.సబ్బులు, కొబ్బరినూనె, టూత్‌పేస్ట్, బ్రష్, టంగ్‌క్లీనర్, ఫేస్‌పౌడర్, షాంపు, దుస్తులు ఉతికే సబ్బు, హెయిర్ బాండ్, రిబ్బన్లు, వాజిలైన్, వాషింగ్ పౌడర్‌లను కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది. వీటి చార్జీలు సకాలంలో అందకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా కాస్మెటిక్, డైట్ చార్జీలను విడుదల చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

అందని దుస్తులు

గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు మూడు జతల దుస్తులను ప్రభుత్వం అందిస్తోంది. అందుకు అవసరమైన టెండర్లను ఆహ్వానించి, విద్యార్థులకు సరఫరా చేస్తుంటుంది. ఇదిలా ఉంటే గతంతో పోల్చితే ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం విద్యార్థులకు అందించే దుస్తులను పంపిణీలో మార్పులు తీసుకువచ్చింది. గతంలో యూనిఫాం కొలతల కోసం విద్యార్థులను గుంపులుగా విభజించేవారు. ఒకరి కొలతల ఆధారంగా మిగతా వారికి తయారుచేసి ఇచ్చేవారు. ఆ కొలతలు సరిపడక విద్యార్థులకు ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం ప్రతి విద్యార్థికి వ్యక్తిగత కొలతలు తీసుకొని యూనిఫాం అందించాలని నిర్ణయించింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిదైనా నేటికీ విద్యార్థులకు యూనిఫాంలు అందకపోవటంతో పాత దుస్తులతోనే పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. అంతేకాక పాఠ్యపుస్తకాలు సైతం మూడురోజుల కిందటే ఇచ్చినట్లు సమాచారం. దసరాకు ముందే విద్యార్థులకు దుస్తులు, కాస్మెటిక్ చార్జీలు అందించాలని తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

చనిపోతున్నానంటూ భర్త వాట్సాప్ మెసేజ్

● అదే చెరువులో దూకి భార్య ఆత్మహత్యాయత్నం



బర్ల సురేందర్

బీబీనగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భర్త ఆత్మహత్యాయత్నాన్ని భరించలేని భార్య అదే చెరువులో దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం రాంనగర్ గ్రామానికి చెందిన బర్ల సురేందర్ (36) హైదరాబాద్ రామంతాపూర్‌లోని ప్రగతినగర్‌లో నివాసం ఉంటూ ఐసీఐసీఐ బ్యాంకు హైటెక్ సిటీ మాదాపూర్ బ్రాంచిలో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. వారం రోజులుగా తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్న సురేందర్ ప్రవర్తనను గమనించిన భార్య సంధ్యారాణి ఇదే విషయాన్ని ఇతర కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో సురేందర్ కుటుంబాన్ని సోదరి లత గురువారం అంబర్‌పేటలోని తన ఇంటికి తీసుకవెళ్లింది. ఇంతలా బాధపడడానికి ఏమైనా అప్పులు ఉన్నాయా? మరేదైనా కారణం ఉందా? చెప్పాలని కోరింది. అన్ని సమస్యలనూ పరిష్కరిస్తానని అక్క ధైర్యం చెప్పింది. అయినప్పటికీ అలాంటిదేమీ లేదని, ఎందుకో బతకాలని లేదు.. చనిపోవాలని ఉందని సురేందర్ చెప్పడంతో అందరూ విస్తుపోయారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆఫీస్‌కు వెళతున్నానని చెప్పి సురేందర్ ఆఫీస్‌కు వెళ్లకుండా ఊబర్‌ను బుక్ చేసుకుని బీబీనగర్ చెరువు కట్టపైకి చేరుకున్నాడు. కారును వెనుకకు తిప్పి పంపాడు. తాను చనిపోతున్నానని కుటుంబ సభ్యులకు వాట్సాప్ ద్వారా వాయిస్ మెసేజ్ పంపించాడు. హుటాహుటిన అక్కడికి వెళ్లిన కుటుంబ సభ్యులకు చెరువు కట్టపై షూ విప్పి అందులోనే మొబైల్ ఫోన్ ఉంచటంతో చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అక్కడి ఆనవాళ్ల ద్వారా గుర్తించారు. కుటుంబ సభ్యులు డయల్ 100కు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక పోలీసులు, అధికారులు అప్రమత్తమై ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని రప్పించి చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. ఓ వైపు గాలింపు కొనసాగిస్తుండగా భార్య సంధ్యారాణి భర్త లేని లోటును జీర్ణించుకోలేక తను చెరువులోకి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. అప్రమత్తమైన ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది చెరువులోకి దూకి ఆమె ప్రాణాలను కాపాడి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

ప్లీజ్ మమ్మీ.. నువ్వు చచ్చిపోతే నాకెవరుంటారు..

అప్పటి వరకు తన పక్కనే కూర్చున్న తల్లి సంధ్యారాణి పరుగెత్తుకుంటూ వెళ్లి చెరువులోకి దూకడంతో కళ్లారా చూసిన ఐదేళ్ల కుమారుడు సాకేత్ తట్టుకోలేకపోయాడు. నీటిలో మునిగిపోతున్న తల్లిని చూసి గుండెలవిసేలా రోధించాడు. పోలీసులు తల్లిని రక్షించి గట్టుపైకి తీసుకురాగానే తల్లి దగ్గరకు పరుగెత్తుకుంటూ వెళ్లి గుండెలకు హత్తుకుని మమ్మీ... నువ్వు చచ్చిపోవద్దు ... నువ్వు అంటే నాకు చాలా ఇష్టం .. నువ్వు చచ్చిపోతే నాకు ఎవ్వరు ఉంటారమ్మా అంటూ రోదించిన తీరును అక్కడున్న వారందరిని కలిచివేసింది. నీ కోసం బతుకుతానని చావనని కుమారుడికి హామీ ఇచ్చింది. అనంతరం విధుల్లో ఉన్న పోలీసులు సంధ్యారాణికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈఘటన పై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ రెడ్డి తెలిపారు.



చావొద్దని అమ్మను బతిమిలాడుతున్న కుమారుడు సాకేత్

ఇళ్లలో చోరీకి పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్



స్వాధీనం చేసుకున్న కారుతో పాటు నిందితులతో పోలీసులు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం గోపాలపురం గ్రామంలోని పేరూరి భాగ్యరాజు నివాసంలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ బండి మోహన్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. 20 రోజుల కిందట గోపాలపురంలో భాగ్యరాజు ఇంట్లో చోరీ జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా శనివారపేట మండలం దొందపాడు గ్రామానికి చెందిన బూలసార గంగశివసాయియుగంధర్ అలియాస్ సాయి, అదేవిధంగా కాకినాడ జిల్లా ఇంద్రపాలెం గ్రామానికి చెందిన మూసీనద గౌరీమల్లేశ్వరితో పాటు మరో ముగ్గురు వ్యక్తులు కలిసి చోరీకి పాల్పడ్డారు. కాగా శుక్రవారం కోదాడ ప్రాంతంలో సాయి, గౌరీమల్లేశ్వరీలు సంచరిస్తున్నట్లు సమాచారం తెలుసుకుని పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వారి వద్ద నుంచి కారు స్వాధీనం చేసుకుని అరెస్ట్‌చేసి కోర్టుకు రిమాండ్ తరలించామన్నారు. ఈ చోరీలో పాల్గొన్న మరో ముగ్గురిని త్వరలో పట్టుకుంటామన్నారు. ఇదిలా ఉండగా ఆగస్టు 17న గరిడేపల్లి మండలం ఎల్‌బీనగర్‌లో చోరీ చేసి అదేరోజు రాత్రి గోపాలపురంలోని భాగ్యరాజు నివాసంలో చోరీ చేసినట్లు గుర్తించామన్నారు. నిందితులు ఎక్కడెక్కడ చోరీ చేశారో గుర్తిస్తున్నామన్నారు. ఈ కేసుపై మరింత లోతుగా విచారణ చేస్తున్నామన్నారు.


ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం

చిట్యాల రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేటకు చెందిన పెద్దబోయిన రాజు(42) దినసరి కూలీ పనిచేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. పనులు లేకపోవడంతో భార్య పుట్టినిల్లు చిట్యాల మండలంలోని పెద్దకాపర్తికి వచ్చి సుమారు మూడు మాసాలుగా ఇక్కడే అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఎలాంటి పనులు దొరక్క ఏం చేయకపోవడం, కుటుంబ అవసరాల రీత్యా అప్పులు చేశాడు. మద్యానికి బానిసై అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో లోలోన మదనపడుతుండేవాడు. జీవితంపై విరక్తి చెందిన తాను అద్దెకుంటున్న నివాసంలో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన భార్య గమనించి స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారమిచ్చింది. రాజుకు భార్యతో పాటు కుమారుడు ఉన్నారు. భార్య జయమ్మ ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘట్‌కేసర్‌లో శాంతినగర్ విద్యార్థిని

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : డిప్లొమా సెకండియర్ చదువుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. కళాశాల సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల శాంతినగర్‌కు చెందిన విద్యార్థిని తులసీ(17) ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలోని మెగా ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా సీఎస్‌సీ సెకండియర్ చదువుతోంది. శుక్రవారం భోజనం విరామం తరువాత హాస్టల్ గదికి వెళ్లి తరగతిలోకి తిరిగి రాలేదు. సాయంత్రం నాలుగు గంటల తరువాత తోటి విద్యార్థినులు హాస్టల్ గదికి వెళ్లి చూడగా లోపలి నుంచి గడియపెట్టి ఉంది. కిటికిలో నుంచి చూడగా తులసీ ఉరివేసుకుని ఉండటం గమనించారు. కళాశాల సిబ్బంది, విద్యార్థినులు తలుపులు పగులగొట్టి ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థిని మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కుటుంబీలకు సమాచారం అందించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ...



దస్సీ(ఫైల్)

అడవిదేవులపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం లైన్‌లో నిలబడి గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లిలో శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. యూరియా పంపిణీకి టోకెన్లు ఇస్తున్నారన్న సమాచారంతో ఈ నెల 11న మండల కేంద్రంలోని రైతువేదిక వద్దకు రైతులు బారీగా తరలివచ్చారు. ఈ క్రమంలో క్యూలైన్లలో నిల్చున్న రైతుల మధ్య తోపులాట జరిగింది. ఇందులో గోన్యాతండాకు చెందిన పాతులోతు దస్సీ(55) అనే మహిళ కిందపడటంతో కాలుకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన రైతులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దస్సీ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. దస్సీకి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఫిట్స్‌తో వలస కార్మికుడు

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఫిట్స్‌తో ఓ వలస కార్మికుడు మృతి చెందాడు. యాదాద్రిభువనగిరి జిల్లా సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన ఓపీ రాజవంశీ(37) స్థానికంగా కూలి పనిచేస్తూ చౌటుప్పల్ మండలం ఎస్ లింగోటంలో భార్య, ముగ్గురు కుమార్తెలో కలిసి ఉంటున్నాడు. గురువారం సాయంత్రం ఓ ఇంటి నిర్మాణ పనిచేస్తుండగా ఫిట్స్ వచ్చి కిందపడిపోయాడు. చేతిలో తాళం చేతులు పెట్టగానే లేచాడు. మళ్లీ 30 నిమిషాల తర్వాత ఫిట్స్ వచ్చి పడిపోయాడు. తాళం చెవిపెట్టినా లేవకపోవడంతో 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. భార్య నిర్మలదేవి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు



లక్ష్మమ్మ

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపారు. మండలం ఎల్లాపురం గ్రామానికి చెందిన కడగోజు లక్ష్మమ్మ ఈ నెల 12న ఉదయం ఆరోగ్యం బాగాలేదని గుర్రంపోడులోని దేవుడిగుడికి అని చెప్పి వెళ్లింది. అయితే ఆమె ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె కుమారుడు సైదాచారి శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మహిళకు సంబంధించిన ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 8712670199, 8712675444 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.



శాంభవీదేవికి పూజలు, అభిషేకాలు

చిట్యాలరూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాద్రపదమాసం శుక్రవారం సందర్భంగా నల్లగొండ జిల్లా చిట్యాల మండలం నేరడ గ్రామంలోని శ్రీమహమ్మాయి శాంభవీ దేవీ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి నల్లగొండకు చెందిన వ్యక్తి పట్టుచీరు అందజేయగా పురోహితులు అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థద ప్రసాదాలును అందజేశారు.

స్కూల్ బస్సు కింద పడి బాలుడి మృతి



పాఠశాలలో విచారణ చేపడుతున్న డీఈవో భిక్షపతి, ఎంవీఐ అధికారులు, గౌతమ్(ఫైల్‌ఫొటో)

పెద్దవూర, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాల బస్సు కింద పడి బాలుడు మృతి చెందాడు. గురువారం నల్లగొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. ఎస్‌ఐ వై.ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా పెద్దకబూరు మండలం కంబాలదిన్నె గ్రామానికి చెందిన కుమ్మరి చంద్రశేఖర్ ఆరు నెలలుగా భార్య, ఇద్దరు కుమారులతో కలిసి పెద్దవూరలోని రంగప్పకాలనీలో నివాసముంటూ కిరాణ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. చంద్రశేఖర్ పెద్దకుమారుడు గౌతమ్ చక్రశాలి(7) పెద్దవూరలోని శాంతినికేతన్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. గురువారం గౌతమ్ చక్రశాలి స్కూల్‌కు వెళ్లేందుకు ఉదయం రోడ్డు దాటుతుండగా తను చదువుతున్న శాంతినికేతన్ స్కూల్ బస్సు డ్రైవర్ భాషిపాక అశోక్ నిర్లక్ష్యంగా, అజాగ్రత్తతో గౌతమ్‌ను ఢీకొట్టాడు. దీంతో గౌతమ్ రోడ్డుపై పడిపోగా బస్సు ముందు చక్రం అతడి పైనుంచి వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. బాలుడిని నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం 1.45గంటల సమయంలో మృతిచెందాడు. గౌతమ్ తండ్రి చంద్రశేఖర్ శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, డ్రైవర్ అశోక్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్‌ఐ తెలిపారు. విద్యార్థి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కుటుంబసభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు.

చర్యలు తీసుకుంటాం : భిక్షపతి, డీఈవో, నల్లగొండ జిల్లా

శాంతినికేతన్ పాఠశాల స్కూల్ బస్సు కింద పడి బాలుడు కుమ్మరి గౌతమ్ చక్రశాలి మృతి చెందిన ఘటనపై విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. శుక్రవారం ఆయన మండలకేంద్రంలోని పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచారణ నిమిత్తం తదుపరి కలెక్టర్‌కు నివేదించి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విచారణలో జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉషశ్రీ, ఎంఈవో తరి రాము తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌పై వెళ్తుండగా వృద్ధుడు...

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట గుట్ట మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. సీఐ బొడ్డుపల్లి భాస్కర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాసాయిపేట గ్రామానికి చెందిన వాసిగిరెడ్డి హనుమంత రెడ్డి(65) గురువారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో సైకిల్‌పై రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో పట్టణానికి చెందిన కన్నయ్య తన కారులో గుట్టకు వస్తూ సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హనుమంత రెడ్డి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదని సీఐ తెలిపారు.



ఇంటి వద్ద ఉన్న విద్యార్థితో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

బడికి ఎందుకు రాలేదు?

విద్యార్థుల ఇంటికి వెళ్లి తెలుసుకుంటున్న ఉపాధ్యాయులు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): బడికి రాని విద్యార్థులకు ఉపాధ్యాయులు వారికి గైర్హాజరు వేస్తారు, లేదా రోజూ రావాలంటూ హెచ్చరించి చూస్తారు. కానీ నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హిమజ, ఉపాధ్యాయులు మూడురోజులుగా బడికి రాని విద్యార్థుల ఇంటికి వెళ్తున్నారు. ఎందుకు గైర్హాజరయ్యారో తెలుసుకుంటున్నారు. గైర్హాజరయ్యే వారిలో పదవ తరగతి చదివే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. బడికి రాకపోవడానికి చెప్పే కారణాలు నిజమేనా కాదా అని ఆరా తీస్తున్నారు. కారణాలు సరికాదనుకుంటే తల్లిదండ్రులకు చెప్పి విద్యార్థులను ద్విచక్రవాహనంపై బడికి తీసుకెళ్తున్నారు. అకారణంగా డుమ్మా కొట్టకుండా బడికి పంపే బాధ్యత మీదని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. ఉపాధ్యాయుల పనితీరును గ్రామస్థులు అభినందిస్తున్నారు.

చింత నీడ



చెట్టు విలువ తెలిపేలా ఉన్న ఈ దృశ్యం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ ప్రభుత్వ పాఠశాల మైదానంలోనిది. 69వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎండనుంచి ఉపశమనం పొందుతూ క్రీడాకారులు, స్థానికులు చెట్ల నీడలో ఆసక్తిగా తిలకించారు.

(ఆంధ్రజ్యోతి-స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, యాదాద్రి)

ఆండాళ్ అమ్మవారికి
ఊంజల్ సేవోత్సవాలు



అద్దాల మండపంలో ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టు వస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధిని శ్రీ రామలింగేశ్వరస్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.12,20,364 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. నీతిఆయోగ్ విద్య, నైపుణ్యత సభ్యుడు ఐ.వి సుబ్బారావు (రిటైర్డ్ ఐఏఎస్) కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. వేద మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డు ప్రసాదాలు అందజేశారు. స్వామివారికొండపై అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తిని ఆయన జన్మదినోత్సవం సందర్భంగా ఆలయ ఈవో వెంకట్రావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో గజ్వేల్లి రఘు, పర్యవేక్షకులు, దేవస్థాన వర్తక సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

మట్టపల్లిలో ప్రారంభమైన పవిత్రోత్సవాలు

మఠంపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మట్టపల్లి మహాక్షేత్రంలో శ్రీ రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ భక్త ప్రహ్లాద సహిత యోగానంద శ్రీలక్ష్మీనృసింహుని ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న పవిత్రోత్సవాలు శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో అఖండ దీపారాధన నిర్వహించారు. వాస్తు హోమాలు, పంచగవ్యారాధనలు నిర్వహించిన తర్వాత క్షీర గుణాధివాస ప్రోక్షణ చేపట్టారు. శయనాధివాసం, అగ్ని ప్రతిష్ఠాపన తదుపరి మహాశాంతి హోమంతో మొదటి రోజు కార్యక్రమాలు ముగిశాయి. రుత్వికులు, అర్చకులు చతుర్వేద పారాయణం, ఇతిహాస పురాణాలు పఠించారు. ఏడాది పొడవునా శ్రీస్వామి సన్నిధిలో నిర్వహించే అర్చనాదులు, ఇతర సేవల్లో జరిగే దోష పరిహారార్థం ఈ పవిత్రోత్సవాలను నిర్వహిస్తామని యాజ్ఞికులు బుర్రా వాసుదేవాచార్యులు తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలోని శ్రీస్వాతీనక్షత్ర మహాయజ్ఞ వాటిక ట్రస్ట్ చైర్మన్ ముక్కూరు శ్రీనివాసన్ పంపిన పవిత్రాలను ఇక్కడి యాగ మండపంలో నుంచి ధర్మకర్తలు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, దేవస్థాన ఈవో సిరికొండ నవీన్ తలపై ఆలయానికి సాయంత్రం చేర్చారు. ఈ కార్యక్రమంలో అర్చకులు తూమాటి రామాచార్యులు, తూమాటి శ్రీనివాసాచార్యులు, తూమాటి కృష్ణమాచార్యులు, అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బ్రహ్మాచార్యులు, బద్రీనారాయణచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి



వరి పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు శ్రీధర్, రాములమ్మ

మద్దిరాల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులకు పరిశోధన కేంద్రంలో అభివృద్ధి చేసిన నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు శ్రీధర్, ఎ.రాములమ్మ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు శుక్రవారం మద్దిరాల మండలంలో చిననెమిల, ముకుందాపురం, రెడ్డిగూడెం గ్రామాల్లో పర్యటించారు. పరిశోధన కేంద్రంలో అభివృద్ధి చేసిన నాణ్యమైన వరి, పెసర విత్తనాలను సరఫరా చేసి విత్తనోత్పత్తిని ప్రోత్సహించేందుకు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ రెవెన్యూ గ్రామంలో ముగ్గురు రైతుల పొలాల్లో నాటిన పంటలను పరిశీలించారు. వరి కేఎన్ఎం 1638 పంటలో ఆకునల్లి, సుడిదోమ ఉధృతి గమనించినట్లు తెలిపారు. నివారణకు స్పైరో మెసిఫెన్ ఒక మిల్లీమీటర్ లీటరు నీటికి చొప్పున పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో అనిషారోహి, ఏఈవో మనోహర్, రైతులు పాల్గొన్నారు.

బెల్లి జనార్దన్‌కు ఎన్టీఆర్ నేషనల్ అవార్డు



అవార్డుతో జనార్దన్

నకిరేకల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు, నటుడు, నిర్మాత బెల్లి జనార్దన్‌కు నందమూరి తారకరామారావు నేషనల్ అవార్డు 2025ను అందజేశారు. విజయవాడలో గురువారం న్యాకంబాల శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మదర్ సర్వీస్ సొసైటీ డాక్టర్ మల్లాది ప్రసాద్ ఆధ్వర్యంలో ఆయనకు ఎన్టీఆర్ నేషనల్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ ఎన్టీఆర్ అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు.

గంజాయి వయా సూర్యాపేట

- ఏపీ, ఛత్తీస్‌ఘఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి గంజాయి సరఫరా
- సరిహద్దు జిల్లా కావడంతో వివిధ మార్గాల్లో జిల్లాలోకి
- మూడేళ్లలో 655 కిలోల గంజాయి స్వాధీనం



సూర్యాపేట జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి(ఫైల్)

సూర్యాపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలు కొందరికి వృత్తిగా మారాయి. జిల్లాలోని ప్రధాన పట్టణాలైన సూర్యాపేట, తిరుమలగిరి, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్లతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ గంజాయి లభిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సరిహద్దులో ఉన్న అరకు ప్రాంతంతో పాటు ఒడిశా, ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రాల నుంచి నుంచి గంజాయిని కొనుగోలు చేసి కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఇందుకు సరిహద్దులో ఉన్న సూర్యాపేట జిల్లాను అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఈ ప్రాంతం మీదుగానే హైదరాబాద్, బెంగళూరు, ముంబాయి వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దులోని కోదాడ మండలం నల్లబండగూడెం వద్ద పోలీసు తనిఖీల్లో తరుచూ గంజాయి పట్టుబడటంతో నిందితులను జైలుకు తరలిస్తున్నారు. దీంతో గంజాయిని తరలించేందుకు గంజాయి ముఠా వినూత్న, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటోంది. ఇలా కారుల్లో ప్రత్యేకంగా ఐరన్ అరలు(ర్యాక్‌లు) అమర్చి కూడా గంజాయిని తరలిస్తుండగా పోలీసులకు పట్టుకున్నారు. అయితే ఎన్నిచర్యలు తీసుకుంటున్నా గంజాయి రవాణా మాత్రం ఆగడంలేదు.

మూడేళ్లలో 655 కిలోల గంజాయి పట్టివేత

సూర్యాపేట జిల్లాలో మూడేళ్ల వ్యవధిలో 655.8కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోగా, 63కేసులు నమోదుచేసి 166మందిని అరెస్టు చేశారు. గంజాయి తాగిన వారికి 90 రోజుల రిమాండ్ విధిస్తున్నా బెయిల్‌పై బయటికి వస్తున్నారు. జిల్లాలో గంజాయికి బానిసలైన వారికి హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులోని డీ-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స అందిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఈ నెల 17వ తేదీ వరకు 117 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 16కేసులు నమోదు చేయగా 47మంది వ్యక్తులను అరెస్టు చేశారు. గతేడాది 20 కేసులు నమోదు కాగా 24.15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 49 మందిని అరెస్టు చేశారు. 2023లో 631.65 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 27 కేసులు నమోదు చేసి 70మందిని రిమాండ్‌కు తరలించారు. అంతేకాక గంజాయి రవాణాకు పాల్పడిన ముగ్గురిపై పీడీ యాక్టు కేసు నమోదు చేశారు.

దారి మారుస్తూ..

రాష్ట్ర సరిహద్దుగా ఉన్న కోదాడ మండలం నల్లబండగూడెం వద్ద చెక్‌పోస్టు ఏర్పాటుచేసి తనిఖీలు ముమ్మరం చేయడంతో ప్రత్యామ్నాయ మార్గాలను గంజాయి ముఠా ఉపయోగిస్తోంది. ఇందుకోసం ప్రధాన రహదారుల్లో కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా నుంచి జగ్గయ్యపేట, ముక్త్యాల, మేళ్లచెర్వు, చింతలపాలెం... దొండపాడు, హుజూర్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు చేర్చుతున్నారు. ఈ క్రమంలోనే హుజూర్‌నగర్‌లో ఇటీవల గంజాయి తరలించే వాహనాన్ని పట్టుకున్నారు.

బానిసలవుతున్న యువకులు

గంజాయి పీల్చేందుకు అలవాటుపడిన యువతపై అది తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఒకసారి అలవాటుపడిన యువకులకు అది తీసుకోకుంటే ఏమీ తోచని పరిస్థితి ఉంటోంది. ప్రతీ రోజూ తాగాలనిపించడం, తాగకపోతే ఆలోచనలు పనిచేయడం లేదన్న ధోరణిలో యువత ఉంటోంది. జిల్లాలో ఈ మత్తుఊచ్చులో ఎక్కువగా 25ఏళ్లలోపు యువకులు ఉన్నారు. గంజాయి తాగడం కోసం తల్లిదండ్రులపై దాడులకు దిగుతున్నారు. గంజాయి మత్తులో ఎక్కువ మంది ఆటో డ్రైవర్లు, డీజే నిర్వాహకులు, రోజువారి కూలీలతో పాటు కొంత మంది విద్యార్థులు కూడా ఉన్నారు. గంజాయి మైకంలో నేరాలకు పాల్పడుతున్నారు.

డబ్బు సంపాదన కోసం వృత్తిగా చేసుకుని

గంజాయిని సేవించడంతో పాటు విక్రయించడాన్ని యువకులు వృత్తిగా మలుచుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అరకు, సీలేరు, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి గంజాయిని తరలిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో కిలో గంజాయి విలువ రూ.10 వేల నుంచి రూ.20వేల వరకు ఉంటోంది. కొనుగోలు చేసిన గంజాయిని ప్యాకెట్లలోకి మారుస్తున్నారు. ఒక్కొక్క ప్యాకెట్‌ను రూ.100నుంచి రూ.500వరకు విక్రయిస్తుంటారు. తాజాగా ఈ ఏడాది జూలై 3వ తేదీన సూర్యాపేట జిల్లా కేంద్రంలో సీసీఎస్, పట్టణ పోలీస్‌లు గంజాయి తరలిస్తున్న ఆరుగురు యువకులను పట్టుకున్నారు. వీరు గంజాయిని తక్కువ ధరకు తెచ్చి ఎక్కువకు విక్రయిస్తుంటారు. జిల్లా కేంద్రంలోని చంద్రన్నకుంటతో పాటు సీతారాంపురం, రాజీవ్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, అంబేడ్కర్‌నగర్, కుడకుడతో పాటు శివారు ప్రాంతాల్లో విక్రయాలు చేస్తున్నారు. పట్టుబడిన వారందరూ అవివాహితులే కావటం గమనార్హం.

గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి



సూర్యాపేట జిల్లాను గంజాయి రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. గంజాయి కేసులో అరెస్టు అయి శిక్షలు పడి తిరిగి వచ్చిన వారిపై నిఘా పెడుతున్నట్లు తెలిపా రు. ప్రస్తుతం ప్యాకెట్ల రూపంలో తెచ్చి విక్రయిస్తున్నారని ఎక్కడైనా విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

\- కె.నర్సింహ, ఎస్పీ, సూర్యాపేట జిల్లా

తప్పని యూరియా కష్టాలు

- యూరియా కోసం రైతుల పడిగాపులు
- పీఏసీఎస్‌ల ఎదుట బారులు



నాంపల్లిలో యూరియా కోసం ధర్నా చేస్తున్న రైతులు

నాంపల్లి, చింతపల్లి, అర్వపల్లి, ఆత్మకూర్ (ఎస్), గుండాల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యూరియా కష్టాలు తొలగడం లేదు. పలు మండలాల్లో యూరియా కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. పీఏసీఎస్ కార్యాలయాల వద్ద రైతులు యూరియా కోసం బారులు తీరారు. యూరియా కోసం నిరీక్షించినా అందకపోవడంతో నల్లగొండ జిల్లాలో ధర్నా చేపట్టగా, సూర్యాపేట జిల్లాలో రాస్తారోకో నిర్వహించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా రైతులకు యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

నాంపల్లి మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రం ఎదుట మండలంలోని రైతులు యూరియా కోసం బారులుతీరారు. శుక్రవారం నాంపల్లి మండల కేంద్రానికి 600 బస్తాల యూరియా సరఫరా అయింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వెయ్యికిపైగా రైతులు ఉదయం నుంచి లైన్‌లో నిలబడ్డారు. 600మందికి యూరియా ఇవ్వడంతో మిగిలినవారు నిరుత్సాహనికి గురై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం గోదాం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, రైతులు నక్కబోయిన నర్సింహ, బండి రవి, నాగరాజు, చంద్రయ్య, వీరయ్య, వెంకటయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- చింతపల్లి మండలకేంద్రంలోని ఆగ్రో రైతు సొసైటీ కేంద్రానికి యూరియా వచ్చిందని తెలుసుకున్న మండలంలోని పలు గ్రామాల రైతులు మార్కెట్ యార్డులో యూరియా కోసం బారులు తీరారు.



జాజిరెడ్డిగూడెంలో సూర్యాపేట-జనగాం రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

- సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలంలో అర్వపల్లి పీఏసీఎస్ కార్యాలయం వద్ద రైతులు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి యూరియా కోసం బారులు తీరారు. ఎంతసేపటికి యూరియా రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉదయం 11 గంటల సమయంలో సూర్యాపేట-జనగాం రహదారిపై రెండు గంటల పాటు రైతులు రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న అర్వపల్లి ఎస్ఐ సైదులు సిబ్బందితో రైతులకు నచ్చజెప్పి రెండు రోజుల్లో యూరియా అందజేస్తామని చెప్పడంతో రైతులు రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఏవో గణేష్, రైతులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఆత్మకూరు (ఎస్)మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద కిలోమీటరు మేర రైతులు యూరియా టోకెన్ల కోసం బారులుతీరారు.
- యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని మర్రిపడగ పీఏసీఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. కార్యాలయానికి వచ్చిన రైతులకు రెండు బస్తాల చొప్పున యూరియా అందజేశారు. యూరియా దొరకని రైతులకు రెండు రోజుల్లో తిరిగి యూరియా రాగానే పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు.

అక్రమంగా యూరియా నిల్వ



బోట్యానాయక్‌తండాలోని రేకుల షెడ్డులో నిల్వ ఉంచిన యూరియా

మిర్యాలగూడ రూరల్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని గూడూరు క్యాంపు బోట్యానాయక్‌తండాలో ఓ రేకులషెడ్డులో యూరియా నిల్వ చేయడంపై శుక్రవారం పలురకాల ఆరోపణలు వెల్లువెత్తాయి. గూడూరుకు సంబంధించిన మోహన్ ఫర్టిలైజర్ దుకాణానికి 220 బస్తాల యూరియాను పంపిణీ చేశారు. సదరు యజమాని అనారోగ్య కారణాలతో గోదాములో కాకుండా బోట్యానాయక్‌తండా రైతులకు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో తండాలోని తన షాపునకు చెందిన షెడ్డులో యూరియా నిల్వ చేశాడు. విషయం తెలుసుకున్న వ్యవసాయాధికారులు అక్కడికి చేరుకొని ఆ యూరియా బస్తాలను రైతులకు దగ్గరుండి విక్రయించారు. ఇదిలా ఉండగా కొందరు ఈ విషయంపై పలురకాల ఆరోపణలు చేస్తూ అధికారులను ప్రశ్నించారు. దీంతో ఫర్టిలైజర్ యజమాని నిర్లక్ష్యమని అన్నారు. అనంతరం ఏవో సైదానాయక్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

పోచంపల్లి బ్యాంకుకు రెండు జాతీయ అవార్డులు



అవార్డులను అందుకుంటున్న పోచంపల్లి అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేష్, పాలకమండలి

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పోచంపల్లి కో- ఆపరేటివ్ అర్బన్ బ్యాం కు రెండు జాతీయ అవార్డులను గెలుచుకుందని అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేష్, సీఈవో సీత శ్రీనివాస్ తెలిపారు. జాతీయ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుల సమ్మేళనాన్ని గోవాలో ముంబాయికి చెందిన బ్యాంకింగ్ ఫ్రాంటియర్స్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు బెస్ట్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌గా, బెస్ట్ కాంప్లియెన్స్ ట్రాన్స్‌ఫార్మేషన్ అవార్డులకు ఎంపికైంది. ఈ అవార్డులను గోవా సహకార శాఖామంత్రి సుభాష్ శిరోడ్కర్, నేషనల్ అర్బన్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జ్యోతీంద్రబాయ్ మెహతా అందజేశారు. ఈ సందర్భంగా అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేష్, సీఈవో సీత శ్రీనివాస్ మాట్లాడుతూ పోచంపల్లి అర్బన్ బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతూ ఇప్పటికి 15 బ్రాంచ్‌లుగా విస్తరించిందన్నారు. త్వరలో మరో 7 బ్రాంచ్‌లు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కర్నాటి బాలసుబ్రహ్మణ్యం, ఏలె హరిశంకర్, సూరెపల్లి రమేష్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, కొండమడుగు ఎల్లస్వామి, బిట్టు భాస్కర్, మక్తాల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా



బైక్‌పై మూడు యూరియా బస్తాలు తీసుకెళ్తున్న రైతు

ద్విచక్ర వాహనంపై ఎరువుల బస్తాలు తీసుకెళ్లడం ప్రమాదకరం. బస్తాలు జారి బైక్ అదుపు తప్పి కిందపడి గాయపడే ప్రమాదముంటుంది. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో ఒక బస్తా అంటే ఏదోలే అనుకోవచ్చు. కానీ యూరియా కొరత మూలంగా దొరినప్పుడే తీసుకెళ్లాలన్న తాపత్రంతో రైతులు బైక్‌పై రెండు, మూడు బస్తాలు తీసుకెళ్తున్నారు. మోత్కూరు సింగిల్‌విండో నుంచి శుక్రవారం ఓ రైతు బైక్‌పై మూడు యూరియా బస్తాలు తీసుకెళ్తూ కనిపించాడు.

(ఆంధ్రజ్యోతి - మోత్కూరు)

నీటి లెక్కల్లో తేడాలు లేకుండా చూడాలి

- కేఆర్ఎంబీ చైర్మన్ బీపీ పాండ్యే
- సాగర్ ఎడమ కాల్వ, ప్రధాన జలవిద్యుత్ కేంద్రాల వద్ద టెలిమెట్రీల పరిశీలన

నాగార్జునసాగర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి విడుదల లెక్కల్లో తేడా లేకుండా చూడాలని కేఆర్ఎంబీ (కృష్ణానదీ యాజమాన్య బోర్డు) చైర్మన్ బీపీ పాండ్యే సూచించారు. రెండు రోజుల సాగర్ పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం ఉదయం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పరిధిలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, అక్కడ టెలిమెట్రీని పరిశీలించారు. ప్రధాన డ్యాం, కుడి, ఎడమ, వరదకాల్వలు, అక్కంపల్లి రిజర్వాయర్ల వద్ద ఏర్పాటు చేసిన టెలిమెట్రీ మీటర్లలో తేడాలు లేకుండా చూడాలన్నారు. అనంతరం సాగర్ వరద, ఎడమ కాల్వ, ప్రధాన డ్యాంల వద్ద ఏర్పాటు చేసిన టెలిమెట్రీలను పరిశీలించారు. సాగర్ నుంచి దిగువకు విడుదలవుతున్న నీటి లెక్కలను, టెలిమెట్రీల్లో నమోదవుతున్న నీటి లెక్కలను పోల్చి చూశారు. నీటి విడుదల లెక్కల్లో స్వల్ప తేడాలున్నట్లు గుర్తించిన ఆయన నీటి లెక్కల్లో తేడాలు లేకుండా సరిచేయాలని సదరు ఏజెన్సీని ఆదేశించారు. ఆరు నెలలుగా టెలిమెట్రీ మీటర్ల సెన్సార్లు అప్‌డేట్ చేయకపోవడంతోనే నీటి లెక్కల్లో స్వల్ప తేడాలున్నట్లు సదరు ఏజెన్సీ సభ్యులు చైర్మన్‌కు వివరించారు. సెన్సార్లను వెంటనే అప్‌డేట్ చేసి నీటి లెక్కల్లో తేడాలు లేకుండా చూడాలని ఏజెన్సీకి చైర్మన్ సూచించారు. ఆయన వెంట కేఆర్ఎంబీ సభ్యులు కేకే జాన్‌గిడ్, శ్రీనివాస్‌రావు, ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్, డీఎస్ఈ నాగేశ్వర్‌రావు, ఈఈ సీతారాం, డీఈ అశోక్, ఏఈలు కృష్ణయ్య, సత్యనారాయణ తదితరులున్నారు.

సాగర్ 24 గేట్ల ద్వారా నీటి విడుదల

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు శుక్రవారం ఉదయం ఎగువ నుంచి వరద రాక మరింత పెరిగింది. దీంతో ప్రాజెక్టు అధికారులు సాగర్ 24 క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 587.20 అడుగులు(305.6242టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 9,500 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 8,629 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,292 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 26 క్రస్ట్‌గేట్లల్లో 18 గేట్లను ఐదు అడుగుల మేరకు, ఆరు క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేరకు ఎత్తి 2,27,256 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 2,81,377 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 2,78,066 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు భద్రతను టీజీ ఎస్పీఎఫ్‌కు అప్పగించాలని బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ రమేష్‌జీ కేఆర్ఎంబీ చైర్మన్ బీపీ పాండ్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు కేఆర్ఎంబీ చైర్మన్ సానుకూలంగా స్పందించారని, పూర్తి స్థాయిలో విచారణ చేసిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని తెలిపినట్లు రమేష్‌జీ తెలిపారు.



నాగార్జునసాగర్ ఎడమ కాల్వ వద్ద టెలిమెట్రీలను పరిశీలిస్తున్న కేఆర్ఎంబీ చైర్మన్ బీపీ పాండ్యే

టెయిల్‌పాండ్‌ను పరిశీలించిన కేఆర్ఎంబీ చైర్మన్

అడవిదేవులపల్లి: మండల శివారులోని టెయిల్‌పాండ్ ప్రాజెక్టును కేఆర్ఎంబీ చైర్మన్ బీపీ.పాండే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నాగార్జునసాగర్ నుంచి విడుదలవుతున్న జలాలు, దిగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుకు ఎన్ని క్యూసెక్కులు విడుదల అవుతున్నాయనే విషయాలను, గేట్ల సామర్థ్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పవర్‌హౌస్‌కు వెళ్లి విద్యుత్ ఉత్పత్తిని పరిశీలించారు. ఆయన వెంట కమిటీ సభ్యులు కమల్, జెన్‌కో ఎస్ఈ వెంకటరమణ, శ్రీనివాసులు, ఈఈ సుబ్రహ్మణ్యం, జయశంకర్, గిరిబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భువనగిరి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లు, వైర్ల మరమ్మతు పనుల కారణంగా భువనగిరి టౌన్ సెక్షన్ పరిధిలోని నిర్దేశిత గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో టౌన్ ఏఈ పి.సాయికృష్ణ తెలిపారు. పగిడిపల్లి, అనంతరం గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జీపీగా లింగారెడ్డి, ఏజీపీగా కుమార్



భువనగిరి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భువనగిరి కోర్టు ప్రభుత్వ న్యాయవాది (గవర్నమెంట్ ప్లీడర్)గా పి.లింగారెడ్డి, భూసేకరణ సహాయ ప్రభుత్వ న్యాయవాది (ఏజీపీ)గా బొల్లెపల్లి కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ ఇద్దరిని న్యాయవాదులు, అధికారులు, ఇతరులు అభినందించి సన్మానించారు.

నైపుణ్యం ఉన్న కార్మికులుగా గుర్తించాలి



ట్రాన్స్‌కో ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న స్పాట్ బిల్లింగ్ కార్మికులు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీజీ ఎస్పీడీసీఎల్ మాదిరిగానే టీజీ ఎన్పీడీసీఎల్‌లో కూడా స్పాట్ బిల్లింగ్ కార్మికులను సెమీ స్కిల్డ్ వర్కర్స్‌గా గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం భువనగిరిలో ట్రాన్స్‌కో ఎస్ఈ సుధీర్‌కు వినతిపత్రం అందజేశారు. మీటర్ రీడింగ్ పూర్తయ్యాక మిగులు రోజుల్లోనూ పని దినాలు కల్పించాలని కోరారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా కనీస వేతనం లభించడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

బస్సులకోసం శ్రామిక మహిళల నిరీక్షణ

● ఎంత వేడుకున్నా ఆగని ఆర్టీసీ బస్సులు



టెక్స్‌టైల్ పార్క్ వద్ద బస్సుల కోసం ఎదురుచూస్తున్న శ్రామిక మహిళలు

చౌటుప్పల్ రూరల్ సెప్టెంబరు 19: మహిళల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం శ్రామిక మహిళలకు అందని ద్రాక్షగానే మిగులుతోంది. మహిళలు కనిపిస్తే బస్సులు ఆపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారు గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్, టెక్స్‌టైల్ పార్క్ పరిశ్రమల్లో చౌటుప్పల్ పరిసర ప్రాంతాల మహిళా కార్మికులు అనేక మంది పనిచేస్తూ రాకపోకలు సాగిస్తుంటారు. చౌటుప్పల్ నుంచి ఉదయం బస్సుకు వెళ్లి సాయంత్రం ఇంటికి వస్తారు. ఆందోళ్‌మైసమ్మ ఆలయం, టెక్స్‌టైల్ పార్క్ వద్ద రిక్వెస్టు బస్టాప్‌లు ఉన్నాయి. కానీ అక్కడ సాయంత్రం సమయాల్లో బస్సులు నిలపడం లేదు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం సమయంలో బస్సు కోసం తీవ్ర ఇబ్బందులు పడవల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం 5గంటల నుంచి ఒక్కోసారి రాత్రి 7గంటల వరకు బస్సుల కోసం నిరీక్షిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైన డ్రైవర్ దయతలిస్తే అపుతున్నారని లేకపోతే రాత్రి అవుతుందని శ్రామిక మహిళలు వాపోతున్నారు.

బస్సులు లేక ఇబ్బంది పడటం కాదు, ప్రతీ పావు గంటలకు హైదరాబాద్ నుంచి చౌటుప్పల్‌కు బస్సులు నడుస్తునే ఉంటాయి. కానీ ఉచిత ప్రయాణికులు అనే వివక్షతతో బస్సులు నిలుపడం లేదని బాధపడుతున్నారు. సాయంత్రం బస్సులు ఆపకపోవడంతో అనేక మంది మహిళలు పరిశ్రమల్లో పని చేయడానికి అసక్తి చూపడం లేదని పరిశ్రమ యజమానులు పేర్కొంటున్నారు. ఇండస్ట్రియల్ పార్క్ వద్ద బస్సులు ఆపడం లేదని ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పరిశ్రమల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళా కార్మికులు పనులకు రాకపోవడంతో పరిశ్రమలపై తీవ్ర ప్రభావం పడుతోందని యజమాని ఓ పరిశ్రమ యజమాని ఎంకే.ప్రసాద్ తెలిపారు. ఆర్టీసీ అధికారులు స్పందించి టెక్స్‌టైల్, ఇండస్ట్రియల్ పార్క్‌ల వద్ద సాయంత్రం సమయాల్లో బస్సులు నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని శ్రామిక కార్మికులు కోరుతున్నారు.

శ్రామిక మహిళలకోసం బస్సులను ఆపాలి



మల్కాపురం టెక్స్‌టైల్ పార్క్‌లో పనిచేయడానికి వివిధ ప్రాంతాల నుంచి మహిళలు ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. సాయంత్రం పని ముగించుకుని ఇంటికి వెళ్లడానికి బస్సు స్టాప్ వద్ద నిలబడితే బస్సులు ఆపడం లేదు. బస్సుల కోసం గంట, రెండు గంటలు ఎదురుచూడాల్సిన పరిస్థితి. బస్సులు ఆపకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. టెక్స్‌టైల్ పార్క్ వద్ద ప్రతీ బస్సు ఆపే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

-శివరాణి, టెక్స్‌టైల్ పార్క్ కార్మికురాలు, దండుమల్కాపురం

రోడ్డుపక్కన కయ్య.. జర పైలం



తుర్కపల్లి మండల కేంద్రంలో వర్షపు వరద నీటికి కోతకు గురైన జాతీయ రహదారి, ప్రమాద సూచికగా రాళ్లు పేరుస్తున్న యువకుడు



తుర్కపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తుర్కపల్లి మండల కేంద్రంలోని భువనగిరి-గజ్వేల్ జాతీయ రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరద నీటికి రోడ్డు కోతకు గురయ్యి కయ్య పెద్ద కయ్య ఏర్పడింది. వాహనదారులు ఏ మాత్రం ఆదమరచి ప్రమాదాల భారీన పడే ప్రమాదముంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు, వాహన చోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైభవంగా బతుకమ్మ సంబరాలు

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 19, (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ సంబరాలను శుక్రవారం పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ మాట్లాడుతూ పండుగ ప్రాముఖ్యతను పిల్లలకు వివరిస్తున్న పాఠశాలల యాజమాన్యాల కృషి అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ మండల , పట్టణ అధ్యక్షులు మంగ సత్యనారాయణ, బందారపు భిక్షపతిగౌడ్, నాయకులు ఎరుకల హేమేందర్‌గౌడ్, మాజీ ఎంఈవో ఎం.జయమోహనాచార్యులు, సీఐ. బొడ్డుపల్లి భాస్కర్, పాఠశాల ప్రిన్సిపల్ గొట్టిపర్తి భాస్కర్‌గౌడ్, డైరెక్టర్ గొట్టిపర్తి మాధురి పాల్గొన్నారు.

ఆరోగ్యం బాగుంటేనే మానవునికి మనుగడ

భువనగిరి రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మానవుని ఆరోగ్యం బాగుంటేనే మనుగడ సాగుతుందని ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ వాసుదేవానంద్ అన్నారు. పీఎం మోదీ పిలుపు మేరకు శుక్రవారం మండలంలోని బొల్లేపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఆవరణలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కంటి , ముక్కు, చెవి , గొంతు , చర్మ వ్యాధి , మానసిక వైద్యులచే సుమారు 135 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సౌజన్య, సాగరిక, కౌశిక్, యామిని శృతి, కొండ మురళి పాల్గొన్నారు.

నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

భువనగిరి రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకున్నట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.గోవర్ధన్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని చందుపట్లలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ బి.సునీత, బి.అనిల్‌కుమార్, డి.శ్రీలత మాట్లాడుతూ అడవి పందుల బెడద నుంచి కాపాడుకునేందుకు రైతులు పంట పొలం చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో జిల్లా విజిలెన్స్ అధికారి మందడి ఉపేందర్ రెడ్డి, డీఏవో పివి రమణారెడ్డి, అభ్యుదయ రైతులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, కంచి మల్లయ్య, సిద్దారెడ్డి, ముకుందారెడ్డి, గీత , కోరమాండల్ ఇంటర్నేషనల్ మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంద్రపాల ముత్యాలమ్మ దేవాలయం పునర్నిర్మించాలి

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలోని మార్కండేయ నగర్‌లోని పురాతన ఇంద్రపాల ముత్యాలమ్మ ఆలయాన్ని పునర్నిర్మించాలని భక్తులు నిర్ణయించారు. దేవాలయం ఆవరణలో శుక్రవారం భక్తులు (గ్రామస్థులు) సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో పట్టణ ప్రముఖులు చింతకింది అంజయ్య, ఎరుకల బీమయ్య, ముత్యాల భూపాల్ రెడ్డి , ఊడుగు మల్లేశ్, ముత్యాల మోహన్ రెడ్డి , పల్చం ఉత్తరయ్య , ఊడుగు వెంకటేశ్ , ఆవుల అండాలు, బాలమణి, యాదమ్మ కేతమ్మ పాల్గొన్నారు. అంతకు ముందు దేవాలయంలో సంప్రదాయ పూజారులైన కుమ్మరులు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

రైతులు సకాలంలో పంట రుణాలు చెల్లించాలి

మోత్కూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట రుణాలు సకాలంలో చెల్లించాలని లేని పక్షంలో వడ్డీ రాయితీ లభించదని మోత్కూరు సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మోత్కూరు సింగిల్ విండో కార్యాలయంలో శుక్రవారం జరిగిన పాలకవర్గ సమావేశంలో పలు తీర్మానాలు చేసినట్టు తెలిపారు. సమావేశంలో సీఈవో కె.వరలక్ష్మీ, డైరెక్టర్లు డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, బండ పద్మ, పురుగుల మల్లయ్య, తాళ్లపల్లి స్వామి, జిట్ట లక్ష్మయ్య, సామ పద్మారెడ్డి పాల్గొన్నారన్నారు.

ఏనుగు నర్సింహారెడ్డి నియామకంపై హర్షం

మోత్కూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిశోధకులు, ప్రముఖ కవి, సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డిని ప్రభుత్వం తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంచాలకులుగా నియమించడం హర్షనీయమని మోత్కూరు ప్రజా భారతి సాహితీ, సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు బోళ్ల హనుమంతు అన్నారు. శుక్రవారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాభారతి కార్యదర్శి బయ్యని వెంకటేశ్వర్లు, అరవిందరాయుడు, గుమిడెల్లి వెంకన్న, ఉప్పలయ్య, వెంకటేశ్వర్లు ఆయన వెంట ఉన్నారు.

గర్భిణులు వైద్యుల సలహాలు పాటించాలి

బొమ్మలరామారం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు తప్పనిసరిగా వైద్యుల సలహాలు పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ సులత అన్నారు. స్వస్త్‌వారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీబీనగర్ ఎయిమ్స్ ఆధ్వర్యంలో ఉచిత గైనకాలజీ, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. 30 ఏళ్లు పైబడిన మహిళలకు గర్భాశయ క్యాన్సర్‌కు ఉచితపాప్ స్మెర్ పరీక్షలు నిర్వహించారు.

కల్తీ నిరోధానికి చర్యలు తీసుకోవాలి

మోత్కూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మోత్కూరులో కల్తీ నూనెలు, నాణ్యత లేని మంచినీటి విక్రయాలను అరికట్టాలని కోరుతూ డిఫెన్స్ వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మోత్కూరు మునిసిపల్ కమిషనర్ కె.సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గుమిడెల్లి పరశురాములు, శివరాత్రి మచ్చగిరి, ఊర సారయ్య, అన్నందాసు మచ్చగిరి, మర్రి కమల్‌నాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డుల పంపిణీ

మోటకొండూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాటూరు జడ్పీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జెన్నే సిద్దులు శుక్రవారం గుర్తింపు కార్డులను అందజేశారు. ఈసందర్భంగా ఎంఈవో కేతిరెడ్డి రఘురాంరెడ్డి మాట్లాడారు. హెచ్ఎం శ్రీకాంత్‌రెడ్డి, లోకేష్‌కుమార్, నరేందర్ ఉన్నారు.

గురువులు నేర్పే విద్యతో ఉన్నత స్థాయికి

బొమ్మలరామారం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి గురువులు చెప్పే విద్యా బుద్ధులతో ఉన్నత స్థాయికి ఎదుగుతారని బొమ్మలరామారం మండలం మాజీ ఎంపీపీ చిమ్మల సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గురుపూజోత్సవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులకు ప్యారారం గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాల డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ (సెప్టెంబరు 5) జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్యారారం గద్దరాలతండా పాఠశాలలోని ఉపాధ్యాయులకు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులకు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు నిర్మలా జ్యోతి, శ్రీదేవిలకు సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో రోజారాణి, మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, కార్యదర్శి మల్లేష్ హెచ్ఎంలు హైమావతి, విజయ్‌కుమార్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి గ్రామస్థులు సురేష్ రెడ్డి, బిక్షపతిగౌడ్, వెంకట్‌రెడ్డి, నాగేష్, లక్ష్మణ్, మల్లేష్, సన్నీరెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

భువనగిరి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం భువనగిరి పట్టణ ప్రధాన రహదారుల వెంట ఆక్రమణల తొలగింపు ప్రారంభమైంది. మొదటి రోజు శుక్రవారం వీధి వ్యాపారుల, స్థానికుల సహకారంతో జగదేవ్‌పూర్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు ప్రశాంతంగా సాగింది. మరో రెండు రోజులపాటు ఈ మార్గంలోనే తొలగింపు ప్రక్రియ కొనసాగనుంది. ఇదే సమయంలో పట్టణ ప్రధాన రహదారి వెంట వీధి వ్యాపారాలను ట్రాఫిక్ పోలీసులు అడ్డుకుని వెనక్కి తరలించారు. జగదేవ్‌పూర్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు పూర్తయ్యాక దశల వారీగా పట్టణ ప్రధాన నల్లగొండ రహదారుల వెంట చౌరస్తాలు గుర్తించిన తొమ్మిది ప్రాంతాల్లో అధికారులు ఆక్రమణలను తొలగించనున్నారు. మునిసిపల్ కమిషనర్ జి రామలింగం, టీపీఎస్ నరేష్ ఆధ్వర్యంలో ఆక్రమణల తొలగింపు జరగగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విశాలంగా జగదేవ్‌పూర్‌రోడ్డు

ఆక్రమణల తొలగింపు పూర్తయ్యాక జగదేవ్‌పూర్ రోడ్డును విశాలంగా తీర్చిదిద్దనున్నారు. 95-100 ఫీట్ల మధ్య విస్తరించి రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. కూలీల అడ్డాలను కూడా తాత్కాలికంగా మార్చనున్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తా



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాల విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామనని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం మండలంలోని తేలుకుంట ఆదర్శ పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రవాణా సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు కోరగా, వెంటనే ఆర్టీసీ డీపో మేనేజర్‌తో మాట్లాడి బస్సు నడపాలని ఆదేశించారు. పాఠశాలకు కిచెన్ షెడ్, కంప్యూటర్ రూమ్‌కి విండోలు, బాయ్స్ టాయిలెట్స్ కావాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనతంరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ రైహిసున్నిసాబేగం మాజీ ఎంపీపీ నూతి రమేష్‌రాజు, నాయకులు సత్తిరెడ్డి, కిష్టయ్య, లింగయ్య, రవి, సహాదేవ్, అనంతరెడ్డి, బాల్‌నర్సింహా శ్రీనివాస్ పాల్గొన్నారు. కాగా వలిగొండలోని రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

బీబీనగర్: బీబీనగర్ మండల పరిషత్ కార్యాలయంలో 57మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.20.84లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోళి పింగల్ రెడ్డి, పొట్టోళ్ల శ్యాంగౌడ్, సురకంటి సత్తిరెడ్డి, మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బస్వయ్య, వాసుదేవరెడ్డి, శ్రీకాంత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రైవేటు కళాశాలల ప్రధాన కార్యదర్శికి సన్మానం

మోత్కూరు : ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మోత్కూరు శ్రీసంతోష్ డిగ్రీ కళాశాల కరస్పాండెంటు సిహెచ్.సత్యంగౌడ్‌ను శుక్రవారం విద్యార్థులు, లెక్చరర్లు ఘనంగా సన్మానించారు. తనను సన్మానించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్‌డే

భువనగిరి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భువనగిరిలోని పద్మావతి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే వేడుకలను నిర్వహించారు.. ఒకేషనల్ కోర్సుల ఆవశ్యకత, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను జిల్లా ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ కిరణ్ వివరించారు.

కుమ్మరి సంఘం మండల కన్వీనర్‌గా వెంకటేశం

రాజాపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజాపేట మండల కుమ్మరి సంఘం మండల కన్వీనర్‌గా బోనాల వెంకటేశంను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కోకన్వీనర్‌లుగా తౌటి కృష్ణమూర్తి, కట్కూరి వెంకటేశం, ఇంద్రపాల అంజనేయులును ఎన్నుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తిచేయాలి

తుర్కపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ జానయ్య కోరారు. శుక్రవారం తుర్కపల్లి మండలం లోని పెద్దతండ, బాబుల్‌నాయక్ తండ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు.

సాదాబైనామాలకు సై

(5వ పేజీ తరువాయి)

గతంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు న్యాయస్థానంలో ఉన్న వివాదం పరిష్కారానికి పలు చర్యలు తీసుకుంది. దీంతో ఇటీవల ఉన్నత న్యాయస్థానం సాదాబైనామా రైతులకు 13-బీ ప్రొసీడింగ్ జారీ చేయడానికి అనుమతించింది. పట్టణాల్లో కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో 2014లో గత ప్రభుత్వం తొలిసారిగా క్రమబద్ధీకరణ నిర్వహించింది. అప్పట్లో దరఖాస్తులన్నీ పరిష్కారానికి నోచుకోలేదు. రెండోసారి 2020లో క్రమబద్ధీకరణకు అవకాశమిస్తూ ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. కానీ ఆర్వోఆర్-1971ను సవరించి తెచ్చిన ఆర్వోఆర్-2020 చట్టంలో క్రమబద్ధీకరణ సెక్షన్లను చేర్చలేదు. ఈ చట్టం న్యాయ వివాదానికి దారి తీసింది. నాటి చట్టం అమలు ఉన్నప్పుడు తీసుకున్న దరఖాస్తులనే పరిగణనలోకి తీసుకోవాలని కోర్టు ఆదేశాలిచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం న్యాయపరమైన అంశాలను అధిగమించి సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అడుగులు వేస్తుండటంతో పేదల ప్రజల కలలు సాకారం కానున్నాయి. సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంతో రిజిస్ట్రేషన్లు జరిగి, ప్రభుత్వానికి సైతం ఆదాయం సమకూరనుంది.

దరఖాస్తుదారులకు త్వరలో నోటీసులు



ప్రభుత్వం సాదాబైనామాల దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశాలు జారీచేసింది. భూభారతి చట్టం కింద మొత్తం ఆన్‌లైన్ ద్వారానే క్రమబద్ధీకరణ చేపట్టనున్నాం. 2014 జూన్ 2వరకు తెల్లకాగితంపై కొనుగోలు చేసి, 2020 అక్టోబరు 1 నుంచి నవంబరు 10వరకు ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తులనే పరిగణనలోకి తీసుకుంటాం. కొనుగోలు చేసిన భూముల్లో రైతులు కబ్జాలో తప్పక ఉండాలి. క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించిన తరువాతే సాదాబైనామాల దరఖాస్తులను క్రమబద్ధీకరిస్తాం.


-కృష్ణారెడ్డి, భువనగిరి ఆర్డీవో

వర్షాలు అధికమే అయినా..

(5వ పేజీ తరువాయి)

సౌకర్యం ఉన్న మోత్కూరు పెద్ద చెరువు, ఇంగీసమ్మ కుంట, కొండగడప చెరువులు మాత్రం నిండాయి. భీమలింగం కాల్వ సౌకర్యం ఉండి, 334 ఆయకట్టు ఉన్న పాలడుగు పెద్దచెరువు మాత్రం నిండలేదు. కాల్వలో నీరు రాలేదని, వర్షాలకు 25శాతం మాత్రమే నీరు వచ్చిందని ఆ గ్రామ రైతులు తెలిపారు. కాల్వల సౌకర్యం లేక 216 ఎకరాల ఆయకట్టు ఉన్న దాచారం చెరువు కూడా నిండలేదు. దత్తప్పగూడెం, ముశిపట్ల చెరువుల్లో కోపులు కూడా నిండలేదు. అనాజిపురం చెరువు కోపులు నిండాయి. బుజిలాపురం చెరువు సగమే నిండింది. బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఆ వాగు వెంట ఉన్న రైతులకు మాత్రం ప్రస్తుతం, వచ్చేయాసంగిలో నీటి కొరత ఉండదు. అయితే చెరువులు, కుంటలు నిండని గ్రామాల్లో యాసంగి బావులు, బోర్లలో నీరు లభించడం కష్టమేనని రైతులు చెబుతున్నారు.

పాలడుగు చెరువు నిండలేదు



మోత్కూరు మండలంలో భారీ వర్షాలు కురిసినా అతి పెద్ద చెరువు అయిన పాలడుగు చెరువు నిండలేదు. దీనికి భీమలింగం కాల్వ సౌకర్యం ఉంది. గతంలో కాల్వ నుంచి నీరు దిగువకు రాకుండా అడ్డుకట్టలు వేసినా, పిల్ల కాల్వలకు గండి కొట్టి నీటిని తీసుకెళ్లినా వాటిని మా గ్రామ రైతులు వెళ్లి సరిచేసి, కాల్వలో చెట్లు, చెత్తచెదారం అడ్డుగా ఉంటే తొలగించే వారు. ఈ సారి రైతులెవరూ చొరవ చూపకపోవడంతో కాల్వలో నీరు రాలేదు. చెరువు నిండలేదు.

-మర్రిపల్లి యాదయ్య, మాజీ సర్పంచ్, పాలడుగు

మండలంలో సాగు విస్తీర్ణం

మోత్కూరు మండలంలో జూన్, జూలై మాసాల్లో వర్షాలు లేక వరి తక్కువగా సాగైంది. ఆగస్టులో కురిసిన వర్షాలకు వరి సాగు విస్తీర్ణం పెరిగింది. మొత్తంగా మండలంలో 3,500 ఎకరాల్లో వరి, 6,500 ఎకరాల్లో పత్తి, 600 ఎకరాల్లో కంది సాగైంది.

స్థానిక పోరుకు సిద్ధంగా ఉండాలి



బూత్ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న బీజేపీ జిల్లా కార్యదర్శి తడిసిన మల్లారెడ్డి

ఆత్మకూరు(ఎం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా పోరుకు సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా కార్యదర్శి తడిసిన మల్లారెడ్డి కార్యకర్తలు, నాయకులను కోరారు. శుక్రవారం మండలంలోని తుక్కాపురంలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ నూతన బూత్ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా సంఘపాక రాజమల్లు, కార్యదర్శిగా జగదీష్ లాభార్థి ప్రముఖ్‌గా నెమ్మాని మధు, మన్‌కీ భాత్ ప్రముఖ్‌గా మల్లెల వెంకన్న, వాట్సాప్ గ్రూప్ ప్రముఖ్‌గా ఏ.మల్లేష్‌తో పాటు నరేష్, గిరిబాబు, అఖిల్, సతీష్, వెంకన్న, నర్సింహాచారిని కమిటీ సభ్యులుగా నియమించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.కాశీనాథ్, ఆర్.మత్స్యగిరి, బి.సాయి పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో 24గంటలు వైద్య సేవలు అందించాలి

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 19, (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించే భక్తులు, స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి 24గంటలు వైద్యులు ఉండాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో సేవా పక్షత్సవాల్లో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రచ్చ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ నాయకులు ఆకుల చంద్రమౌళి, నరేష్, ప్రభాకర్, సత్యనారాయణ, కర్ణ, బి.శ్యామ్‌సుందర్, అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకుని శుక్రవారం చౌటుప్పల్ మునిసిపాలిటీలోని తంగడపల్లి జడ్పీహెచ్ఎస్ లో విద్యార్థులకు బీజేపీ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చ మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ కడారి కల్పన యాదవ్ , నాయకులు దూడల బిక్షం గౌడ్, రమనగోని శంకర్, ముత్యాల భూపాల్ రెడ్డి ,ఆలె చిరంజీవి, ఆర్. దీపిక , కడారి అయిలయ్య, ఊడుగు విజయలక్ష్మి, భాస్కర్ పాల్గొన్నారు.

పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీని రద్దు చేయాలి

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలోని చేనేత సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీని రద్దు చేయాలని కమిటీ అధ్యక్షుడు కందకట్ల బిక్షపతి(బీఆర్ఎస్) కోరారు. చేనేత, జౌళి శాఖ భువనగిరి ఏడీకి శుక్రవారం బిక్షపతి అందుకు సంబంధించిన లేఖ ను అందజేశారు. సంఘాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని ప్రత్యేకాధికారిని నియమించాలని, చేనేత కార్మికుల సంక్షేమం కోసం తగిన చర్యలు తీసుకోవాలని ఏడీ ని బిక్షపతి కోరారు.

మహిళా మోర్చా అసెంబ్లీ కన్వీనర్‌గా కల్పన యాదవ్

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మహిళా మోర్చా మునుగోడు అసెంబ్లీ కన్వీనర్‌గా కడారి కల్పన యాదవ్‌ను నియమిస్తూ శుక్రవారం మోర్చారాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బీజేపీ చౌటుప్పల్ పట్టణ అధ్యక్షురాలుగా బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్న కల్పనకు అదనంగా మునుగోడు మహిళా మోర్చ బాధ్యతలను అప్పగించారు. కాగా, తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన మునుగోడు అసెంబ్లీ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని కల్పనయాదవ్ తెలిపారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేసేంత వరకు పోరాటం

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేసేంతవరకు పోరాటాలు కొనసాగుతాయని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.కోటం రాజు హెచ్చరించారు. చౌటుప్పల్ పట్టణంలో శుక్రవారం భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా 4 వ మహాసభలను నిర్వహించారు. సభల్లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.స్వామి, నాయకులు ఎండీ.పాషా, కల్లూరి మల్లేశం, గోశిక కరుణాకర్, ఎ. నందీశ్వర్, కలకుంట్ల శివ, నరసింహ్మా, శ్రీరాములు, కోట సంధ్యారాణి, రాములు, రామచంద్రం పాల్గొన్నారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులకు టీఎల్ఎం మెటీరియల్ పంపిణీ

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దోతిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 55 మంది విద్యార్థులకు రూ.20వేల విలువైన వస్తు సామగ్రి, టీఎల్ఎం మెటీరియల్‌ను హయత్‌నగర్ లయన్స్‌క్లబ్ వారు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డి.అప్పారావుగౌడ్, కార్యదర్శి జి మల్లారెడ్డి, పగిల్ల మల్లారెడ్డి, శ్రీనివాస్, దేవాప్రసాద్, మాణిక్‌రెడ్డి, నాగశంకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, బాలస్వామి, పాఠశాల హెచ్ఎం అశోక్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శ సాయికుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు భువనగిరికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరత్

భువనగిరి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కె.శరత్ శనివారం భువనగిరిరి రానున్నారు. జిల్లా కోర్టులో నిర్వహిస్తున్న సెమినార్‌లో జిల్లా కోర్టులలోని పెండింగ్ కేసులను, ఇతర అంశాలను సమీక్షించనున్నారు ఈ మేరకు న్యాయశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా అవగాహన సదస్సు ఏర్పాటు

రామన్నపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో న్యాయ సేవా అధికార సంస్థ రామన్నపేట ఆధ్వర్యంలో లీగల్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్ పాఠశాలలో లీగల్ ఎయిడ్ క్లీనిక్ ఏర్పాటు చేసి, విద్యార్థులకి అవగాహన కల్పించారు. విద్యార్థులు దసరా సెలవుల సందర్భంగా ఇంటికి వెళ్ళే క్రమంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యత అవగాహన ముఖ్యం అని అన్నారు. విద్య హక్కు చట్టం ఫోక్సో చట్టం, మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాలు, బాల కార్మికులు చట్టాలు, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ఆలేరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని బీజేపీ మండల అధ్యక్షుడు పూజారి కుమార స్వామి గౌడ్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన సందర్భంగా శుక్రవారం ఆలేరు మండలం సాయిగూడెంలో చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.